క్లుప్తంగా

సాయిబాబాకు ప్రత్యేక పూజలు



పూజల్లో పాల్గొన్న కలెక్టర్ రాజకుమారి

నంద్యాల(వ్యవసాయం): స్థానిక బొమ్మలసత్రంలోని షిరిడీ సాయిబాబా మందిరంలో కలెక్టర్ రాజకుమారి గురువారం మధ్యాహ్న హారతి కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆలయ నిర్వాహకులు కలెక్టర్‌కు సాదరంగా స్వాగతం పలికారు. అనంతరం సాయినాథునికి ప్రత్యేక పూజలు నిర్వహించి మంగళహారతులు ఇచ్చారు. కలెక్టర్ రాజకుమారి మాట్లాడుతూ సాయి మందిరాన్ని షిరిడీ నమూనాలతో నిర్మించడం సంతోషించదగ్గ విషయం అన్నారు. అనంతరం ఆలయ నిర్వాహకులు కలెక్టర్‌ను బాబా ప్రతిమ, ప్రసాదం అందజేసి సత్కరించారు.

డిజిటల్ అసిస్టెంట్లు ఆధార్ నమోదు చేయాల్సిందే



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ

ఉయ్యాలవాడ: గ్రామ సచివాలయాల్లో విధులు నిర్వహిస్తున్న డిజిటల్ అసిస్టెంట్లు ప్రజలకు అందుబాటులో ఉంటూ ఆధార్ నమోదు తప్పనిసరిగా చేయాలని ఎంపీడీఓ ఉమామహేశ్వరరావు సూచించారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో డిజిటల్ అసిస్టెంట్లతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆధార్ అనుసంధానం సంబంధించి కొందరు డిజిటల్ అసిస్టెంట్లు ఆధార్ ఉత్తీర్ణత సాధించలేదని తప్పుకుంటున్నారని.. ఇకపై తప్పుకునే వారిపై జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామన్నారు. ప్రజలకు సేవలు, పథకాలు అందించాల్సిన బాధ్యత ఉద్యోగులపై ఉందన్నారు. ఈఓపీఆర్డీ నాగలక్ష్మమ్మ పాల్గొన్నారు.

కర్ణాటక హత్యలపై విచారణ జరిపించాలి



మున్సిపల్ కార్యాలయం వద్ద నిరసన తెలియజేస్తున్న మహిళలు

నంద్యాల (వ్యవసాయం): కర్ణాటక రాష్ట్రంలోని ధర్మస్థలిలో వరుసగా మహిళలపై జరిగిన అత్యాచారాలు, హత్యల ఘటనలపై విచారణ జరిపి బాధ్యులను కఠినంగా శిక్షించాలని ఉమెన్ ఇండియా మూమెంట్ నాయకురాలు మైమున్నీసా డిమాండ్ చేశారు. గురువారం దేశవ్యాప్తంగా మహిళల భద్రతపై తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయని, ఈ దారుణమైన ఘటనలను ఖండిస్తూ, ఉమెన్ ఇండియా మూవ్‌మెంట్(డబ్ల్యూఐఎం), నంద్యాల శాఖ ఆధ్వర్యంలో స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద మహిళలతో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఆమె మాట్లాడుతూ సుప్రీంకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించి బాధిత కుటుంబాలకు న్యాయం చేయాలని కోరారు. 1995 నుంచి అత్యాచారాలు హత్యలు జరిగాయని తెలిసి దేశం మొత్తం దిగ్భ్రాంతికి గురవుతోందని, పోలీస్ వ్యవస్థ లోపాలపై విచారణ చేయాలని, ఈ ఉదంతం బయటకు రాకుండా తొక్కిపెట్టిన వారిని శిక్షించాలని విజ్ఞప్తి చేశారు. ఫహీం ముంతాజ్, వివిధ మహిళా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో ధన్వంతరి, చండీహోమాలు

మహానంది: ఆషాడమాసం, అమావాస్య సందర్భంగా గురువారం మహానందిలోని యాగశాలలో వేదపండితులు బ్రహ్మశ్రీ చెండూరి రవి శంకర అవధాని, ప్రధాన అర్చకులు మామిళ్లపల్లి అర్జునశర్మ, వేదపండితులు నాగేశ్వరశర్మ ధన్వంతరీ, చండీహోమాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పలు ప్రాంతాల భక్తులు ప్రత్యక్షంగా, పరోక్షంగా హోమపూజల్లో పాల్గొన్నారు. అలాగే స్థానిక అలంకార మండపంలో మహానందీశుడి దంపతుల కల్యాణం కనులపండువగా సాగింది. గంగ, కామేశ్వరీదేవి మహానందీశ్వరస్వామి ఉత్సవమూర్తులను అలంకరించి కల్యాణ క్రతువులను నిర్వహించారు.

చంద్రబాబు మోసాలను ప్రజల్లోకి తీసుకెళ్దాం

- మాజీ ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి



అల్లూరులో మాట్లాడుతున్న గంగుల బిజేంద్రారెడ్డి



హాజరైన వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు

ఉయ్యాలవాడ: ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా మరోసారి ప్రజలను మోసం చేస్తున్న చంద్రబాబును ఎండగట్టాలని, ఆయన మోసపూరిత హామీలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఆళ్లగడ్డ మాజీ ఎమ్మెల్యే గంగుల బిజేంద్రా రెడ్డి పిలుపునిచ్చారు. గురువారం సాయంత్రం అల్లూరు, మాయలూరు గ్రామాల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన 'బాబు ష్యూరిటీ - మోసం గ్యారంటీ' విస్తృతస్థాయి సమావేశాల్లో ఆయన మాట్లాడారు. కూటమి సర్కార్‌కు వైఎస్సార్‌సీపీ అంటే భయం పట్టుకుందన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలతో పాటు మరో 143 హామీలు ఏమయ్యాయని ప్రశ్నించారు. రైతులకు అన్నదాత సుఖీభవ, విద్యార్థులకు ఫీజ్ రీయింబర్స్‌మెంట్, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, 20 లక్షల ఉద్యోగాలు, నిరుద్యోగ భృతి, ప్రతి మహిళకు ఆడబిడ్డ నిధి కింద నెలకు రూ. 1500 ఎందుకు ఇవ్వలేకపోతున్నారని ప్రశ్నించారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో రాష్ట్రానికి 17 మెడికల్ కళాశాలలు వచ్చాయని గుర్తుచేశారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వానికి విద్యార్థులకు సీట్లు ఇవ్వడం కూడా చేతకావడం లేదని మండిపడ్డారు. చంద్రబాబు మోసపూరిత హామీలను ప్రజా క్షేత్రంలోకి తీసుకెళ్లాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. అంతకు ముందు సర్పంచ్ జనపాల సాయిరెడ్డి, మాజీ సర్పంచ్ ఆరికట్ల శివరామక్రిష్ణారెడ్డి, మాజీ ఉప సర్పంచ్ కూలూరు రామక్రిష్ణారెడ్డి, స్థానిక నాయకులు రేనాటి నరసింహారెడ్డి, షేక్షావలిరెడ్డి, సుదర్శన్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి, ఎర్రారెడ్డి, సుబ్బరాయుడుతో కలిసి ఆయా గ్రామాల్లో పర్యటించారు. బాబు మోసాలను క్యూఆర్ కోడ్ ద్వారా స్కాన్ చేసి ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ బుడ్డా చంద్రమోహన్‌రెడ్డి, ఎంపీటీసీ సభ్యులు బాలిరెడ్డి, దేవి, సర్పంచ్‌లు దేశం సోమశేఖర్‌రెడ్డి, రామమద్దిలేటిరెడ్డి, పల్లె గురుప్రసాద్‌రెడ్డి, నాయకులు కసాని ప్రతాప్‌రెడ్డి, ఎర్రి శ్రీనివాసరెడ్డి, తరిగోపుల ప్రసాద్‌రెడ్డి, పల్లె శివశంకర్‌రెడ్డి, పేరెడ్డి సుబ్బారెడ్డి, ముసాని శివానందరెడ్డి, ఆరికట్ల శివారెడ్డి, మల్లిఖార్జునరెడ్డి పాల్గొన్నారు.



క్యూఆర్ కోడ్ ద్వారా మహిళలకు చంద్రబాబు మోసాలను వివరిస్తున్న మాజీ ఎమ్మెల్యే గంగుల

తుపాన్‌పై మినుము రైతుల ఆందోళన



సాగులో ఉన్న మినుము పంట

శిరివెళ్ల: తుపాన్‌పై మండల రైతులు ఆందోళన చెందుతున్నారు. ప్రధానంగా మినుము పంట సాగు చేసిన అన్నదాతలు దిగులు చెందుతున్నారు. ప్రస్తుతం పంట కోత కోయడానికి సిద్ధంగా ఉంది. అయితే 5 రోజులుగా జడివాన కురుస్తుండడంతో సాధ్యపడడం లేదు. ఈ ఏడాది మే చివరిలో కురిసిన వర్షాలకు రైతులు పంటను సాగు మొదలు పెట్టారు. మండలంలో 2,280 హెక్టార్లలో మినుము పంట సాగైంది. అత్యధికంగా గుంప్రమాన్‌దిన్నెలో వెయ్యి హెక్టార్లు, కోటపాడులో 350 హెక్టార్లు, జీనేపల్లెలో 300, శిరివెళ్లలో 250 హెక్టార్లు, యర్రగుంట్ల 200, గోవిందపల్లె 165 హెక్టార్లు సాగు చేశారు. వర్షాలు ఇలానే పడుతుంటే మినుము కాయలు తడిసి కుళ్లిపోతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంపై ఏఓ సుధాకర్ మాట్లాడుతూ.. మినుము పంటపై బీమా చేస్తున్నామని, గుంప్రమాన్‌దిన్నెలో మొదలైందన్నారు. ఈ నెలాఖరులోగా అన్ని గ్రామాల్లో పంట బీమా చేస్తామని తెలిపారు.

త్వరలో ఆన్‌లైన్‌లో ఇంటి పన్నుల చెల్లింపు



ఆన్‌లైన్ ప్రక్రియను పరిశీలిస్తున్న డిప్యూటీ ఎంపీడీఓ

శిరివెళ్ల: త్వరలో ఇంటి పన్నులను ఆన్‌లైన్ ద్వారా చెల్లించే విధానం అమలులోకి వస్తుందని డిప్యూటీ ఎంపీడీఓ శ్రీనివాసశర్మ తెలిపారు. గురువారం యర్రగుంట్ల, శిరివెళ్ల గ్రామ పంచాయతీలో జరుగుతున్న ఇళ్ల సమాచార ఆన్‌లైన్ ప్రక్రియను పరిశీలించారు. మండలంలోని అన్ని పంచాయతీల్లో ఇళ్ల సమగ్ర సమాచారంతో ఆన్‌లైన్ ప్రక్రియ మొదలైందని చెప్పారు. మండలంలో 25 వేల ఇళ్లు ఉన్నాయన్నారు. అందులో 2 వేల ఇళ్ల సమాచారం ఆన్‌లైన్ చేశామన్నారు. యర్రగుంట్లలో 1970 ఇళ్లకు గాను 500, శిరివెళ్ల పంచాయతీలో 4వేల ఇళ్లకు గాను 1200 ఇళ్ల వివరాలు ఆన్‌లైన్ చేసినట్లు తెలిపారు. ఈ నెల 31తేదీలోగా వంద శాతం పూర్తి చేయాలని సిబ్బందిని ఆదేశించారు. ఇంటి పన్ను బకాయిలు, 2025-26లో ఎంత చెల్లించాలన్నది ఆన్‌లైన్ చేస్తున్నామన్నారు. ప్రస్తుతం 4 అంకెలతో ఇంటి నంబర్లు ఉన్నాయన్నారు. ఆన్‌లైన్ ప్రక్రియ పూర్తి కాగానే 12 అంకెలతో ఇంటి నంబర్ కేటాయిస్తామని పేర్కొన్నారు.

కచ్చితత్వంతో సర్వే రికార్డులు రూపొందించాలి



మాట్లాడుతున్న వెంకటేశ్వరరావు

నంద్యాల(అర్బన్): గ్రామ సర్వేయర్లు, ఆధునిక సర్వే సాంకేతిక పరికరాలతో సంబంధిత స్టాఫ్‌వేర్‌ను ఉపయోగించి కచ్చితత్వంతో కూడిన సర్వే రికార్డులను తయారు చేయాలని సర్వే, భూమి రికార్డుల శాఖ ప్రాంతీయ సంయుక్త సంచాలకులు వెంకటేశ్వరరావు సూచించారు. స్థానిక పీజీఆర్ఎస్‌లో సర్వే యంత్రాంగంతో భూ సర్వేపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ 2027లోపు భూముల రీ సర్వే పూర్తి చేయాలని ప్రభుత్వం సంకల్పించిందన్నారు. భూ సమస్యల పరిష్కారానికి రీ సర్వే భూయజమానులకు ఒక మంచి పరిష్కార వేదిక అని అన్నారు. భూ యజమానుల సహాయ సహకారాలతో సర్వే బృందం నాణ్యతతో సర్వే చేయాలని చెప్పారు. సర్వే సమయంలో ఏదైనా సమస్య వచ్చినా, రైతులకు అర్థమయ్యేటట్లు వివరించాలన్నారు. నిర్దేశించిన సమయంలోపు రైతుల దరఖాస్తులను పరిష్కరించాలని ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా సర్వే, భూ రికార్డుల శాఖ అధికారి జయరాజు, ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వే డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వే, మండల, గ్రామ సర్వేయర్లు పాల్గొన్నారు.

మహిళలు, విద్యార్థినులు అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న అడిషనల్ ఎస్పీ యుగంధర్‌బాబు,



పాల్గొన్న విద్యార్థులు

నంద్యాల(న్యూటౌన్): మహిళలు, విద్యార్థినులు తమ భద్రతపై అప్రమత్తంగా ఉండాలని అడిషనల్ ఎస్పీ యుగంధర్‌బాబు సూచించారు. గురువారం రామకృష్ణ డిగ్రీ కళాశాలలో మహిళలు, పిల్లల భద్రతపై అవగాహన కార్యక్రమాన్ని కళాశాల చైర్మన్ రామకృష్ణారెడ్డి అధ్యక్షతన జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన అడిషనల్ ఎస్పీ మాట్లాడుతూ విద్యార్థినులు రక్షణ పద్ధతులను నేర్చుకోవాలన్నారు. మిమ్మల్ని మీరు రక్షించుకుంటూ మీ చుట్టుపక్కల వారికీ అవగాహన కల్పించాలని తెలిపారు. బాలికల భద్రత కోసం నంద్యాలలో నిరంతరం నిఘా పర్యవేక్షణ ఉందన్నారు. కళాశాల డైరెక్టర్ హేమంత్‌రెడ్డి, శక్తిటీం ఇన్‌చార్జి జయరాములు, డీఎస్పీ మందా జావళి, పోలీసులు పాల్గొన్నారు.

చాగలమర్రికి చేరుకున్న విశ్వబ్రాహ్మణుల చైతన్య యాత్ర



చాగలమర్రికి చేరుకున్న విశ్వబ్రాహ్మణ చైతన్య యాత్రలో మాట్లాడుతున్న పుష్పగిరి

చాగలమర్రి: తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లోని విశ్వబ్రాహ్మణ సమాజాన్ని చైతన్య పరచడమే లక్ష్యంతో విశ్వకర్మ నాలెడ్జ్ సెంటర్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ‘విశ్వబ్రాహ్మణ చైతన్య యాత్ర’ గురువారం చాగలమర్రికి చేరింది. ఈ పాదయాత్రకు స్థానిక విశ్వబ్రాహ్మణ సంఘం సభ్యులు ఘన స్వాగతం పలికారు. హైదరాబాద్ ఎల్‌బీ నగర్ నుంచి ఈ నెల 6న ప్రారంభమైన ఈ యాత్ర వైఎస్సార్ కడప జిల్లాలోని బ్రహ్మంగారి మఠం వరకు సుమారు 450 కిలోమీటర్ల దూరం జూలై 27 వరకు కొనసాగనుందని నిర్వాహకులు తెలిపారు. యాత్ర ముగిసిన అనంతరం బ్రహ్మంగారి మఠంలో బహిరంగ సభ నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా నాలెడ్జ్ సెంటర్ ప్రతినిధులు మాట్లాడుతూ.. కొన్నేళ్లుగా విశ్వబ్రాహ్మణులు అణచివేతకు గురవుతున్నారని, తమ హక్కుల సాధనకు సమయం ఆసన్నమైందని తెలిపారు. ప్రభుత్వం విశ్వకర్మల అభివృద్ధికి 10 మందితో కూడిన కార్పొరేషన్ పాలకమండలి ఏర్పాటు చేయాలని, వడ్రంగి వృత్తిదారులకు మిషన్ లైసెన్సులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. రాజకీయ ప్రాధాన్యత కల్పించాలన్నారు. కార్యక్రమంలో వీర మహేంద్రాచారి, బ్రహ్మయ్యచారి, వీరభద్రాచారి, శంకరాచారి పాల్గొన్నారు.

ఎన్నటికి బాగయ్యేను?



దెబ్బతిన్న ఎం.క్రిష్ణాపురం - గుండుపాపలకు వెళ్లే రహదారి

గోస్పాడు: మండలంలోని ఎం.క్రిష్ణాపురం నుంచి గుండుపాపలకు వెళ్లే రహదారి పూర్తిస్థాయిలో శిథిలమైంది. ఈ రహదారి వెంట రోజూ చుట్టుపక్కల గామాల ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారు. రహదారి మొత్తం గుంతల మయంగా మారింది. దీంతో తరుచూ ప్రమాదాలబారిన పడాల్సి వస్తోందని వాహనదారులు వాపోతున్నారు. పక్షవాత బాధితులకు మందు అందించే నిలయంగా పేరు పొందిన ఉమాపతినగర్ గ్రామం కూడా ఈ రహదారి వెంటే ఉండటంతో వాహనాల రాకపోకలు అధికంగా ఉంటాయి. అటు కోవెలకుంట్ల, ఇటు నంద్యాల ఎటు వైపుల నుంచి వచ్చినా ఈ రహదారిపై యాళ్లూరు మీదుగా తిరిగి నేషనల్ హైవే కడప రహదారికి వెళ్లేందుకు వీలుగా ఉంటుంది. దాదాపుగా 8 సంవత్సరాల క్రితం ఈ రోడ్డు వేశారు. అప్పటి నుంచి మరమ్మతులుకు నోచుకోకపోవడంతో పూర్తిగా దెబ్బతిని రాకపోకలకు వీలుకానంతగా మారింది. అయినా అధికారులు పట్టించుకోకపోవడంపై వాహనదారులు, ఆయా గ్రామాల ప్రజలు మండిపడుతున్నారు. రహదారి శిథిలం కావడంతో అటు వైపు వెళ్లే వారు కిలోమీటర్ల కొద్ది చుట్టూ తిరిగి వెళ్లాల్సి వస్తుంది. పంటల సీజన్ ప్రారంభం కావడంతో పొలాలకు వెళ్లాలన్నా, ఎరువులు, మందులను తీసుకెళ్లాలన్నా రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా రోడ్డును బాగు చేయాలని ఆయా గ్రామాల ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు.

బంగారు కుటుంబాలను గుర్తించాలి

- జిల్లా కలెక్టర్ రాజకుమారి

నంద్యాల: గ్రామ సభల ద్వారా అర్హులైన బంగారు కుటుంబాలను గుర్తించాలని జిల్లా కలెక్టర్ రాజకుమారి అధికారులను ఆదేశించారు. ఏపీ సచివాలయం సీఎస్ కాన్ఫరెన్స్ హాల్ నుంచి గురువారం సాయంత్రం స్వర్ణ ఆంధ్ర పీ4 ఫౌండేషన్, సానుకూల ప్రజా దృక్పథం, ఏజెంట్ కోసం డాక్యుమెంట్ అప్‌లోడ్, ఆర్‌టీజీఎస్ లెన్స్‌పై సూచనలు, నగర గ్యాస్ సరఫరాకు సంబంధించిన సమస్యలు తదితర అంశాలపై జిల్లా కలెక్టర్లతో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి తీసుకోవాల్సిన చర్యలపై దిశా నిర్దేశం చేశారు. కలెక్టరేట్‌లోని వీసీ హాల్ నుంచి జిల్లా కలెక్టర్ రాజకుమారి, జేసీ విష్ణు చరణ్ పాల్గొన్నారు. వీసీ అనంతరం అధికారులతో కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో గ్రామ సభల ద్వారా మార్గదర్శి, బంగారు కుటుంబాలను గుర్తించే కార్యక్రమాన్ని త్వరగా పూర్తి చేయాలని సూచించారు. పీ-4 మోడల్ సర్వే గురించి ప్రతి ఒక్కరికీ తెలియజేయాలన్నారు. పేదరికంతో దిగువన ఉన్న కుటుంబాలను బంగారు కుటుంబంగా భావిస్తూ వారికి చేయూతనిచ్చే మార్గదర్శులను గుర్తించే ప్రక్రియ పూర్తి చేయాలన్నారు. విద్యుత్, ఇసుక, గృహ నిర్మాణం, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు లైసెన్సుల జారీ తదితరాల్లో పారదర్శక సేవలను అందించి ప్రజలలో అవగాహన పెంచాలని చెప్పారు. జిల్లాకు సంబంధించి ప్రగతి డేటాలో ప్రభుత్వం నిర్దేశించిన డాక్యుమెంట్లను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు.

నియామకం

గోస్పాడు: పీఆర్‌టీయూ మండల ప్రధాన కార్యదర్శిగా శ్రీనివాసులును ఏకగ్రీవంగా ఎంపిక చేసినట్లు జిల్లా అధ్యక్షుడు రామపక్కీర్‌రెడ్డి గురువారం తెలిపారు. మండల ప్రధాన కార్యదర్శిగా ఉన్న సురేష్ కుమార్ ఇటీవల జరిగిన బదిలీల్లో వెళ్లడంతో శ్రీనివాసులును ఏకగ్రీవంగా ఎంపిక చేశామన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి చాంద్‌బాషా, మండల అధ్యక్షుడు భాస్కరుడు, నాయకులు విజయరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సైబర్ నేరగాళ్లతో జాగ్రత్త

బండి ఆత్మకూరు: సైబర్ నేరగాళ్లతో జాగ్రత్తగా ఉండాలని ఎస్ఐ జగన్‌మోహన్ సూచించారు. గురువారం సోమయాజులపల్లి గ్రామంలో ప్రజలకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. అపరిచితుల నుంచి వచ్చే మొబైల్ నంబర్లకు బదులు ఇవ్వొద్దని, మొబైల్‌లో ఎలాంటి బెట్టింగ్ యాప్‌లను డౌన్‌లోడ్ చేసుకోవద్దని, వాటిని సోషల్ మీడియా ద్వారా ఇతరులకు షేర్ చేయవద్దని సూచించారు. వ్యక్తిగత, బ్యాంకు ఖాతాల వివరాలు, ఓటీపీ ఎవరికీ చెప్పరాదన్నారు. అనుమానిత యాప్‌లపై టోల్ ఫ్రీ నెంబర్ 1930కు కాల్ చేయాలన్నారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

శ్రీశైలం టెంపుల్: శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న ధర్మపథం కార్యక్రమంలో భాగంగా గురువారం ఆలయ దక్షిణ మాడ వీధుల్లోని నిత్య కళావేదికపై సికింద్రాబాద్‌కి చెందిన ఆర్.కె.ఎస్. కళానిలయం వారి సంప్రదాయ నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. వినాయకకౌత్వం, నటేశకౌత్వం, భో.. శంభో, మహాదేవశివ, లింగాష్టకం, అయిగిరినందిని తదితర గీతాలకు సహస్ర, లౌక్య, జ్యోతిర్మయి అక్షరఅలేఖ్య, మైత్రి, స్వాతి, కిరణ్మయి తదితరులు నత్యప్రదర్శన చేశారు.

ఘనంగా చౌడేశ్వరి దేవి జయంతి



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

నంద్యాల(వ్యవసాయం): స్థానిక బైటిపేటలో వెలసిన శ్రీ చౌడేశ్వరి దేవస్థానంలో ఆషాఢమాస బహుళ అమావాస్య, చౌడేశ్వరిదేవి జయంతి మహోత్సవ వేడుకలను శ్రీ చౌడేశ్వరి దేవి సేవా సమితి ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు, సామూహిక కుంకుమార్చనలు నిర్వహించి మహామంగళ హారతులు ఇచ్చారు. ఆలయ అధ్యక్షుడు చెన్నా శ్రీనివాసులు ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేపట్టారు. సాయంత్రం అమ్మవారిని పురవీధుల్లో ఊరేగించారు.



గోస్పాడు: మండలంలోని శ్రీనివాసపురం గ్రామంలో శ్రీచౌడేశ్వరిదేవి జయంతి వేడుకలను గురువారం గ్రామస్తులు వైభవంగా నిర్వహించారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. గ్రామంలో ఆలయంలో ఏటా జయంతి వేడుకలను నిర్వహిస్తున్నారు. మహిళలు అధిక సంఖ్యలో అమ్మవారికి బోనాలను సమర్పించారు.

చౌడేశ్వరీదేవికి ప్రత్యేక పూజలు



క్రిష్టిపాడులో చౌడేశ్వరిదేవిని దర్శించుకుంటున్న భక్తులు



భక్తులకు అన్నదానం

దొర్నిపాడు: ఆషాడమాసం ఆమావాస్యను పురస్కరించుకుని గురువారం చౌడేశ్వరీదేవికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారికి చీర సారె, పండ్లు, పూలు, పిండి వంటలు సమర్పించి భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు.

భక్తిశ్రద్ధలతో జయంతి వేడుకలు



సుద్దమల్లలో..

ఉయ్యాలవాడ: మండలంలోని సుద్దమల్ల, ఇంజేడు గ్రామాల్లో వెలసిన ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయా గ్రామాల్లో ఉదయం నుంచే మహిళలు అమ్మవారికి చీర, పసుపుకుంకుమ, కొబ్బరికాయ సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. అర్చకులు కమలేష్ శర్మ, అనంతయ్య తీర్థప్రసాదాలు అందజేశారు.

పెరుగుతున్న బీపీ, షుగర్ బాధితులు

- జిల్లాలో 1,52,333 మందికి బీపీ, 1,15,572 మంది షుగర్ బాధితులు
- జిల్లాలో 10.46 లక్షల మందికి పరీక్షలు చేయగా 2.67 లక్షల మంది వ్యాధిగ్రస్తుల గుర్తింపు
- 25 శాతం పైగా ఎన్‌సీడీ సర్వేలో వ్యాధి నిర్ధారణ
- జీవన విధానంలో మార్పులే కారణం
- 18 సంవత్సరాల వారిని వదలని రోగాలు
- జాగ్రత్తలు తీసుకోవాలంటున్న వైద్యులు



శిరివెళ్లలో జరిపిన సర్వేలో బీపీ పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది (ఫైల్)

ఆత్మకూరుకు చెందిన 25 సంవత్సరాలున్న అశోక్ ఇటీవల తలనొప్పితో బాదపడుతూ చికిత్స కోసం నంద్యాల పట్టణంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి వచ్చాడు. అక్కడ వైద్య పరీక్షల చేయగా గతంలో ఎప్పుడూ గుర్తించని బీపీ ఉన్నట్లు చెప్పారు. కొత్త సమస్య తలెత్తడంతో జీవితాంతం మందులు వాడాలని వైద్యులు చెబుతుండటంతో హతాశుడయ్యాడు.

నంద్యాలకు చెందిన నాగేంద్రకు 22 సంవత్సరాలకే షుగర్ వ్యాధి ఉన్నట్లు వైద్యులు నిర్ధారించారు. కొంత కాలంగా కాళ్లు, చేతుల తిమ్మిర్లతో పాటు తలతిరుగుతండటంతో పరీక్షలు నిర్వహించారు. అయితే ఉన్న జబ్బు సంగతి అలా ఉంటే.. షుగర్ కూడా తోడయినట్లు నిర్ధారించారు.

గోస్పాడు: గతంలో ప్రజలు అన్నిరకాల పనులను స్వతాహాగా చేసుకునేవారు. మారుతున్న కాలనుగుణంగా అత్యాధునికంగా ఎన్నో రకాల నూతన విధానాలు అందుబాటులోకి వచ్చినా నిశ్చలంగా ఉండి పనులు చేసుకునే పరిస్థితి లేదు. తీరిక లేని పనులతో ఉరుకులు పరుగుల జీవనాన్ని సాగిస్తున్నారు. దీంతో రోగాలను కొని తెచ్చుకుంటున్నారు. ప్రతి పది మందిలో ఒకరిద్దరు బీపీ, షుగర్ వంటి సమస్యలతో బాధపడుతున్నారు.

ఎన్‌సీడీ సర్వేలో వెల్లడవుతున్న కేసులు..

జిల్లాలోని 29 మండలాల్లోని 516 సచివాలయాల పరిధిలో వైద్య పరీక్షలు నిర్వహించారు. గత నవంబరు నుంచి వైద్య, ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో చేస్తున్న ఎన్‌సీడీ స్క్రీనింగ్‌లో రోగులు అధికంగా నమోదువుతున్నారు. జిల్లాలో 18 ఏళ్ల పైబడిన వారికి నిర్ధారణ పరీక్షలు చేయగా ఇందులో దీర్ఘకాలిక రోగులు అధికంగా బయటపడుతున్నారు. బీపీ, షుగర్ ఉన్నట్లు నిర్ధారణ అయితే మళ్లీ సదరు పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ వైద్య పరీక్షలు నిర్వహిస్తారు. గుర్తించిన వారికి ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ఉచితంగా మందులు అందజేస్తున్నారు. గతానికి భిన్నంగా పల్లెల్లో పనులు చేసేవారికి కూడా బీపీ, షుగర్ బయటపడుతుండటం ఆందోళన కలిగిస్తోంది. శారీరక వ్యాయామం లేకపోవడం, వేళాపాల లేకుండా ఆహారం తీసుకోవడం, పొగ తాగడం, ఆల్కహాల్, ఒత్తిళ్లు..కి రోగాలకు కారణమవుతున్నాయి.

వయస్సుల వారీగా బీపీ, షుగర్ వ్యాధి బారిన పడిన వారి వివరాలు..

వయస్సు	బీపీ కేసులు	షుగర్ కేసులు
18-19	440	371
20-29	3,138	2,624
30-39	9,378	7,895
40-49	25,824	21,019
50-59	42,121	33,290
60పైన	71,432	50,393

ముందు జాగ్రత్తలతో ఆరోగ్యం



ఆధునిక జీవన శైలిలో వయస్సుతో సంబంధం లేకుండా బీపీ, షుగర్ బారిన పడుతున్న వారి సంఖ్య పెరుగుతోంది. ప్రతి ఒక్కరూ ఈ వ్యాధులపై అవగాహన కలిగి ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలి. ఆహారంలో నియమ నిబంధనలు పాటించాలి. ఉప్పును మోతాదుకు మించి తీసుకోకూడదు. చెడు అలవాట్లకు దూరంగా ఉండి ప్రతి రోజూ వ్యాయామం, చేయడం మంచిది.

–డాక్టర్ మదన్‌మోహన్‌రావు, జనరల్ మెడిసిన్ హెచ్ఓడీ, జిల్లా ఆసుపత్రి, నంద్యాల

అదుపులో లేకపోతే అవస్థలే...

బీపీ ఎదుర్కొంటున్న వారిలో మహిళలు, పురుషులు ఇద్దరూ సమానంగా ఉంటున్నారు. సాధారణ రక్తపోటు 120/80గా ఉండాలి. ప్రస్తుతం 140/90 వరకు ఉన్నా సాధారణ స్థితి కిందే భావిస్తున్నారు. ఈ అంకెలు దాటితే మాత్రం తక్షణం అప్రమత్తం కావాలని వైద్యులు సూచిస్తున్నారు. ఇప్పటికే మధుమేహం, గుండె జబ్బులు, మూత్ర పిండాల వ్యాధులతో బాధపడుతున్నవారు మరింత అప్రమత్తంగా ఉండాలి. తగిన జాగ్రత్తలు తీసుకోకపోతే ఈ సమస్య ఇంకా అధికమయ్యే ప్రమాదం ఉందని హెచ్చరిస్తున్నారు.